క్లుప్తంగా

వార్డు అధికారులతో కమిషనర్ సమీక్ష



వార్డు అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం వార్డు అధికారులతో మున్సిపల్ కమిషనర్ సరస్వతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రేడ్ లైసెన్సులు, దుకాణాల లైసెన్సులు, ఎంతవరకు వచ్చాయో ఆరా తీశారు. ముఖ్యంగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులదారులను క్షేత్ర పర్యటనకు వెళ్లి గుర్తించాలని సూచించారు. శానిటేషన్ సిబ్బందితో కలిసి సెల్ఫీ ఫొటోలు దిగి అప్‌లోడ్ చేయాలన్నారు. ఫీల్డ్ వర్కులో ఏమైనా సమస్యలు గుర్తించిన వెంటనే తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ జాన్ కృపాకర్, ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

తుక్కుగూడ: సామాజిక న్యాయం, సమరభేరి అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గోగికర్ జానకీరామ్ పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో సభను నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర ముఖ్య నాయకులు హాజరవుతున్నారన్నారు. పార్టీ గ్రామ, మండల శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న అందెల శ్రీరాములు, రాజు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జనప్రియా మహానగర్‌కు చెందిన సాయి అనే యువకుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడం, వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయాన్ని స్థానిక నాయకుడు రాజు దృష్టికి తీసుకెళ్లారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో చికిత్స నిమిత్తం రూ.2 లక్షల ఎల్‌ఓసీని మంజూరైంది. ఈ మేరకు ఎల్‌ఓసీని గురువారం బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, అభిమన్యు, రాజు, వెంకట్, అరవింద్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్ ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో డిగ్రీ, పీజీ కళాశాలలను బంద్ చేయించారు. విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, ఘాన్సీ, రహీం, అనూష, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో మార్కెట్ ఉద్యోగుల నిరసన

చాదర్‌ఘాట్: మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శిని ఆ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని ఏఎంసీ టీఎన్‌జీఓస్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి ముక్రం అన్నారు. సంఘటనను నిరసిస్తూ గురువారం మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మార్కెటింగ్ శాఖ మంత్రి, ప్రిన్సిపాల్ సెక్రటరీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- అడ్డుగా ఉన్న స్తంభాలు, చెట్లు తొలగించాలి
- రహదారి విస్తరణ పనులు త్వరగా ప్రారంభించండి
- ఎమ్మెల్యే సబితారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హెచ్చరించారు. గురువారం 'రహదారుణం' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గాంధీనగర్ టూ నాదర్‌గుల్ వరకు రోడ్డు విస్తరణ పనులు ఎందుకు ప్రారంభించడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణకు గతంలోనే రూ.9కోట్లు మంజూరైనప్పటికీ పనులు మొదలు పెట్టడం లేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ముందుగా అడ్డంగా ఉన్న స్తంభాలను, చెట్లను తొలగించకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు ఎమ్మెల్యేకు వివరణ ఇచ్చారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమై స్తంభాలను తొలగించాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రికకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి, డీఈఈ వెంకన్న, ఇతర అధికారులు ఉన్నారు.

స్టీల్ బ్రిడ్జి పనులు అడ్డుకున్న భక్తులు

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా నిర్మాణం చేపట్టొద్దని నిరసన



చంచల్‌గూడ: హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా శాస్త్రానికి వ్యతిరేకంగా బ్రిడ్జి నిర్మాణం చేయొద్దని ప్రాజెక్టు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నారని సైదాబాద్ హనుమాన్ దేవాలయ పరిరక్షణ సమితి సభ్యులు గురువారం పనులను అడ్డుకున్నారు. 2020లో మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ మెయిన్‌లో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ శాఖ అధికారులు మార్కింగ్ చేస్తున్న క్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. మెజార్టీ హిందువుల మనోభావాలను గౌరవిస్తూ ఆలయం మీదుగా బ్రిడ్జి నిర్మాణం ఆపాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను పలుమార్లు కలిసినా పట్టించుకోవడం లేదన్నారు. భక్తుల ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో అధికారులు వారితో మాట్లాడారు. అతి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని ప్రాజెక్ట్ ఈఈ గోపాల్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో నాయకులు రవీందర్‌రెడ్డి, నిరంజన్ యాదవ్, ఉగాది మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

వివాదాలు సమసిపోయే వరకు పనులు మొదలు పెట్టొద్దు..

సైదాబాద్: స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం విషయమై అన్ని వివాదాలు, అభ్యంతరాలు పూర్తిగా సమసిపోయే వరకు స్టీల్ బ్రిడ్జ్ పనులు మొదలు పెట్టవద్దని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ తేల్చి చెప్పారు. పనులు తిరిగి మొదలు పెట్టేందుకు గురువారం అధికారులు వచ్చి సిబ్బందితో బారికేడ్లు ఏర్పాటు చేస్తుండగా బీజేపీ నాయకులు వారిని అడ్డుకున్నారు. అభివృద్ధి పనులకు తాము కూడా సహకరిస్తామని కానీ వివాదం వలన చెలరేగిన పలు సమస్యలను పరిష్కరించిన తర్వాతనే పనులు మొదలు పెట్టాలన్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

చేవెళ్ల: రైతులు పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మండల కేంద్రంలో గురువారం జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద రైతులకు ఉచితంగా కంది విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆహార పంటల ఉత్పత్తులను సాగుచేసి అధిక లాభాలను పొందాలని సూచించారు. రైతులకు కంది విత్తనాల (ఎల్‌ఆర్‌జీ-105, ఎల్‌ఆర్‌జీ-52) మినీ కిట్స్ విత్తనాల ప్యాకెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు జాబితాపై శిక్షణ

కొత్తూరు: ఓటరు జాబితాలో పలు మార్పులు, ఇతర అంశాలపై బీఎల్‌ఓలకు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని షాద్‌నగర్ ఆర్డీఓ సరిత పరిశీలించి వారికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఓటరు నమోదు, జాబితాలో తప్పుల సవరణలు, ఒక వార్డు నుంచి మరో వార్డు లేదా ఇతర ప్రాంతానికి ఓటు మార్చుకోవడంతో పాటు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంతేగాకుండా కొన్ని చోట్ల చనిపోయిన వారి పేర్లు కూడా జాబితాలో ఉండడం, మరికొన్ని చోట్ల ఒక ఓటరుకు రెండు చోట్ల జాబితాలో పేర్లు ఉండడాన్ని గుర్తించి సరిచేయాలని సూచించారు. తమ పరిధిలోకి వచ్చే ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు, జంగయ్య, బాలవర్ధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: అధికారులు, ఉద్యోగులందరూ ప్రతిరోజు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను వాడాలని ఎంపీడీఓ సంధ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బయోమెట్రిక్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె బయోమెట్రిక్ వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొత్తం 15 మంది అధికారులు, సిబ్బంది ఉన్నారని, అందరూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని సూచించారు.

మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రులను తరలిస్తున్న ఫైర్ సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న డీఎఫ్‌ఓ వెంకన్న

మలక్‌పేట: హైద్రాబాద్ జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మూసారంబాగ్‌లోని నెక్స్ట్ గలేరియా మాల్‌లో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫైర్‌ఇంజిన్లు, 108 అంబులెన్స్‌లు, సైరన్‌లతో మోతలతో వాహనాలు ఒక్కసారిగా మాల్‌కు చేరుకున్నాయి. ఫైర్ ఇంజన్‌లతో నీళ్లు కొట్టడం, క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లోకి ఎక్కించడం, జనం అంతా గూమికూడటంతో అక్కడి వారంతా ఉలిక్కిపడ్డారు. ఇదంతా అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్ అని తెలియడంతో అందరూ ఊపరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా హైద్రాబాద్ జిల్లా ఫైర్ ఆఫీసర్ తగరం వెంకన్న మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయస్ఫూర్తిగా ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో భవనం పై నుంచి రావడానికి లిఫ్ట్ వాడకూడదన్నారు. ప్రతీ ఇంట్లో ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, ఫైర్ స్టేషన్ ఫోన్ నంబర్లు ప్రతీ ఒక్కరి సెల్‌ఫోన్‌లో ఫీడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ఫైర్ ఆఫీసర్ షౌకత్, గలేరియా మాల్ ఇన్‌చార్జి పంకజ్ శర్మ, సుబ్రమణ్యం, ఫైర్, 108 అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



షాద్‌నగర్: రాంచందర్‌రావును సత్కరిస్తున్న నాయకులు



చేవెళ్ల: రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును గురువారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, నర్సింహాయాదవ్, సుధాకర్, బల్వంత్‌రెడ్డి, మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, రంగన్నగౌడ్, నరేందర్‌రెడ్డి, బోయ అశోక్, మహేశ్, అనిల్‌కుమార్‌గౌడ్, సుధీర్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

చేవెళ్ల: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును పార్టీ చేవెళ్ల నియోజకవర్గ నాయకులు గురువారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, జిల్లా నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ మల్గారి విజయ్‌భాస్కర్‌రెడ్డి, నాగరాజు, ఆయా మండలాలకు చెందిన నాయకులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా చేవెళ్లకు చెందిన బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

మండల నాయకులు

కేశంపేట: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎంపికైన రాంచందర్‌రావును జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేశ్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి

కొత్తూరు: మహిళలు తమకు ఆసక్తి ఉన్న ఉపాధి రంగాల్లో రాణించాలని జన శిక్షణ సంస్థాన్ జిల్లా డైరెక్టర్ రామ్మోహన్ సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు ప్రభుత్వ సహకారంతో స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలన్నారు. శిక్షణ అనంతరం మహిళలకు వ్యాపారం, మార్కెట్ అవకాశాలతో పాటు సర్టిఫికెట్లను అందించనున్నట్లు స్పష్టం చేశారు. సంస్థ సభ్యులు స్వప్న, ఆనంద్‌కుమార్, గీత పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

మీర్‌పేట: అర్హులందరికీ తెల్ల రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లను వెంటనే ఇవ్వాలని సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి పూర్తిగా అమలు కాలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో, నిరుపేదలకు స్థలం ఇచ్చి నిర్మాణానికి రూ.8 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో.. సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శి పిచ్చిరాజు, మహిళా సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి యాదమ్మ, కార్యవర్గ సభ్యులు పాండునాయక్, జగదీష్, రేఖ, సునీత ఉన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సింగరేణి గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కలెక్టర్‌కు కోట్ల శ్రీనివాస్ వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో 30 సంవత్సరాలుగా నివసిస్తున్న గుడిసెవాసులకు అక్కడే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కాలనీలో నివసించే గుడిసెవాసులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆధార్, ఓటర్, రేషన్ కార్డులు అన్నిరకాల ధ్రువపత్రాలు మంజూరై ఉన్నాయన్నారు. సింగరేణి గుడిసెల ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ అధికారులు రహదారులు, వీధిదీపాలు వంటి పలు రకాల మౌలిక వసతులు కూడా కల్పించారని ఆయన వివరించారు. అయితే ఇటీవల సింగరేణి కాలనీపై కన్నేసిన కొందరు సొసైటీల పేరుతో ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను తప్పు దారి పట్టిస్తున్నారని ఆరోపించారు. గుడిసెవాసులను తొలగించి తాము ఇక్కడి స్థలం పొందుదామని సొసైటీల పేరుతో కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అవసరమైతే సింగరేణి కాలనీ గుడిసెవాసుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తామని ఆయన అన్నారు. తన వినతికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కోట్ల శ్రీనివాస్ తెలిపారు.


ఓటరు జాబితా నవీకరణలో బీఎల్‌ఓలు కీలకం



బీఎల్‌ఓల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న డీసీ మంగతాయారు

సైదాబాద్: ఓటరు జాబితా నవీకరణ, సవరణల్లో బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ)లు కీలకంగా వ్యవహరిస్తారని సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మంగతాయారు అన్నారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వినయనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నూతన బీఎల్‌ఓలకు ఓటరు జాబితా రూపకల్పనపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని డీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఎల్‌ఓలకు ఇచ్చిన యాప్‌ల ద్వారా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. ఇంటింటికి తిరగడం ద్వారా ఓటర్ల పూర్తి వివరాలు, ఆధారాలు సేకరించాలని తెలిపారు. ఓటరు జాబితా రూపొందించడంలో నూతనంగా వచ్చిన నిబంధనలు, మార్పులు, సడలింపులపైన, ఫాం నెంబర్: 6, 7, 8లపై బీఎల్‌ఓలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని డీసీ వారికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు సురేందర్‌గౌడ్, మహ్మద్ షఫీవుద్దీన్, రత్నమ్మ పాల్గొన్నారు.

పీర్లకు దట్టీల సమర్పణ



మలక్‌పేట: పీర్ల పండుగ మత సామరస్యతకు ప్రతీక అని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అన్నారు. మొహరం సందర్భంగా ఇన్‌స్పెక్టర్, ఎస్సై కే. రాజశేఖర్‌రెడ్డి, మలక్‌పేట మైత్రీ కమిటీ కన్వీనర్ లింగాల శ్రీనివాస్‌గౌడ్ గడ్డిఅన్నారం అషూర్ ఖానాలోని పీర్ల దర్శించుకుని దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా పండుగలు, ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నిర్వాహకులు ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శివకుమార్, ప్రవీణ్‌కుమార్, నిర్వాహకులు ఫిరోజ్‌ఖాన్, అజ్మల్‌ఖాన్, అబ్దుల్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ తగాదాలో పోలీసు అత్యుత్సాహం

- అక్రమంగా పీఎస్‌లో గిరిజన మహిళా నేత కట్టడి
- సైదాబాద్ ఠాణా ఎదుట బైఠాయించిన మహిళలు



ఠాణా ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న సేవాలాల్ బంజారా సంఘం నేతలు

సైదాబాద్: సింగరేణి కాలనీలో ఇరువురి మధ్య అప్పు విషయమై తగాదా ఏర్పడింది. పూర్తిగా సివిల్ వ్యవహారమైన ఈ విషయంలో సైదాబాద్ ఎస్సై తలదూర్చారు. అంతే కాకుండా మధ్యవర్తిగా వచ్చిన గిరిజన మహిళా నాయకురాలిని అసభ్యంగా దూషించడమే కాకుండా 'నీ పైన కేసులు నమోదు చేస్తా'అంటూ ఆమె ఫోన్ గుంజుకొని పీఎస్‌లోనే ఉండాలంటూ కట్టడి చేశాడు. విషయం తెలుసుకున్న సేవాలాల్ బంజారా సంఘం నాయకులు, మహిళలు గురువారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఎస్సైని ప్రశ్నించడంతో...

◆ సింగరేణి కాలనీలో నివసించే శివాలాల్ తన బంధువు అయిన మైఖేల్ వద్ద రెండేళ్ల క్రితం రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. అయితే ఈ అప్పు తిరిగి చెల్లించేందుకు శివాలాల్ సిద్ధంగా ఉన్నా మైఖేల్‌కు అతని కుమారుడికి ఉన్న గొడవల వల్ల చెల్లింపు వాయిదా పడుతూ వచ్చింది. ఈ విషయంలో సైదాబాద్ ఎస్సై సాయికృష్ణ కలుగజేసుకున్నాడు. గురువారం శివాలాల్‌ను పీఎస్‌కు పిలిచి మాట్లాడుతున్నాడు. మధ్యవర్తిగా సేవాలాల్ బంజారా సంఘం మహిళా అధ్యక్షురాలు, సీపీఐ నగర నాయకురాలు సక్రిబాయి వెళ్లింది. సివిల్ కేసు విషయంలో మీరెందుకు జోక్యం చేసుకుంటున్నారని ఆమె ప్రశ్నించింది.

◆ సాయికృష్ణ కోపంతో ఆమెను దుర్భాషలాడాడు. 'నీ పైన కేసులు నమోదు చేస్తా..'అంటూ బెదిరిస్తూ ఆమె ఫోన్ తీసుకొని పీఎస్‌లోనే ఉండాలంటూ ఆర్డర్ వేసాడు. విషయం తెలుసుకున్న సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ మహిళా నేతలతో అక్కడికి వచ్చి పీఎస్ ముందు బైఠాయించారు. వెంటనే పోలీసులు సక్రిబాయిని వదిలేసారు. వారితో చర్చించి పీఎస్ నుంచి పంపించేశారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి.. లేదంటే కమిషనరేట్ ముట్టడిస్తాం



సింగరేణి కాలనీలో నివసించే గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సెక్టార్ ఎస్సై సాయికృష్ణ ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నాడని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ అన్నారు. ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని అక్రమ దందాలు నిర్వహించే వారి నుంచి బహిరంగంగా మామూళ్లు వసూలు చేస్తున్నాడని తెలిపారు. సివిల్ కేసు వ్యవహారంలోనూ ఎస్సై మహిళా నేతను ఇబ్బందులకు గురి చేశాడు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ ఆయనపై చర్యలు తీసుకుంటామన్నారు. వారంలోపు ఎస్సై సాయికృష్ణపై చర్యలు తీసుకోవాలి. లేదంటే వేలాదిగా తరలి వెళ్లి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.